www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 ఫిబ్రవరి 2024
5
అన్నమయ్య



రాష్ట్ర స్థాయి పోటీలకు జ్ఞానాంబిక విద్యార్థులు



రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులతో గురుప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లి : రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు స్థానిక జ్ఞానాంబిక విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ డాక్టర్ గురుప్రసాద్ తెలిపారు. జిల్లా స్థాయిలో రాయచోటిలో నిర్వహించిన క్రికెట్, కబడ్డీ బాలిక విభాగంలో తమ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యారన్నారు. శుక్రవారం రాయచోటిలో నిర్వహించిన బాలికల విభాగం క్రికెట్ పోటీల్లో రైల్వేకోడూరు జట్టుపై పది వికెట్ల తేడాతో మదనపల్లి జట్టు గెలుపొందింది. కబడ్డీ క్రీడలో ఐదు పాయింట్లు తేడాతో మదనపల్లి జట్టు గెలుపొంది ప్రథమ స్థానంలో నిలిచి కప్పులు అందుకుందన్నారు. స్థానిక రామారావు కాలనీ, ఎస్‌బిఐ కాలనీ సచివాలయం జట్టు తరఫున తమ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారన్నారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ ఆర్ గురు ప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, పీడీ శరత్ నాయక్ జగదీష్ అభినందించారు.

కెపి ఉల్లి రైతు విలవిల



- భారీగా ధరలు పతనం
- దళారులు నిర్ణయించిందే ధర
- రూ.8 వేల నుంచి రూ.2,300లకు పడిపోయిన వైనం
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

ఉల్లి పేరు వినగానే మార్కెట్లో ఎవరి నోట విన్నా ఘాటు వినిపిస్తుంది. అయితే కృష్ణాపురం (కెపి) ఉల్లి సాగు చేసిన రైతు పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఉల్లి ధరలు మార్కెట్లో పర్వాలేదు అనుకుంటే పండించిన పంటను అమ్మకం చేసేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. కెపి ఉల్లి సాగు చేసిన రైతులు రూ.పది సంపాదించుకోవచ్చు అని ఆశించడం, పండించిన పంటను అమ్ముకునేందుకు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. సాగుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చులు చేయాల్సి వస్తోంది. విత్తనాలు కిలో రూ.1000 నుంచి రూ.1500 వరకు వెచ్చించి కొనుగోలు చేసి ఎకరాకు 23 కిలోల వంతున వినియోగిస్తారు. నూర్పిడి చేసేందుకు రూ.10 వేలు ఖర్చు అవుతుంది. గతనెలలో క్వింటా రూ.8 వేలు ఉన్న ధరలు క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.2 వేలకు పడిపోయాయి. రాయలసీమకు విదేశీ మారక ద్రవ్యం తీసుకువచ్చే అతి పెద్ద పంట కెపి ఉల్లి. అలాంటి పంటకు విదేశీ ఎగుమతిలను కేంద్ర ప్రభుత్వం నిషేధించడంతో అమ్మకానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. స్థానికంగా అమ్మకం చేయాలంటే దళారులు నిర్ణయించినదే ధర. మైదుకూరు కేంద్రంగా జిల్లాలోని దువ్వూరు, బ్రహ్మంగారిమతం మండలాలతో పాటు కర్నూలు జిల్లాలో సాగయ్యే ఉల్లికి పలు రోగాలను నయం చేసే గుణం కలిగి ఆరోగ్యప్రదాయినిగా పేరుగాంచింది. రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాలో సాగైన ఉల్లిపాయలకు ఈశాన్య ఆసియా దేశాలైన సింగపూర్, మలేషియా, దుబాయ్, హాంకాంగ్, శ్రీలంక దేశాలలో మంచి డిమాండ్ ఉండేది. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై నిషేధం విధించింది. మనదేశంలో వినియోగించే ఉల్లిపాయలకు, ఎగుమతుల అవసరాలకు పండించే ఉల్లిపాయలకు వ్యత్యాసం ఉంది. ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించకుండా అన్ని ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించింది. జిల్లాలో మైదుకూరు, దువ్వూరు ఇతర ప్రాంతాలలో గతంలో పది వేల ఎకరాలకు పైగా ఉల్లి పంట సాగయ్యేది. ప్రభుత్వ ప్రోత్సాహం తగ్గడం, ధరలు లేకపోవడంతో క్రమేపి తగ్గుతూ ఏడాది కేవలం 2 వేల ఎకరాలు మాత్రమే సాగైంది. రైతులు ఉల్లి పంటను ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో సాగు చేయడం ఆనవాయితీ. ప్రారంభంలో క్వింటా కెపి ఉల్లి ధర రూ.11 వేలతో ప్రారంభమై రూ.8000 వరకు తగ్గాయి. ప్రస్తుతం రూ.2300 మాత్రమే పలుకుతున్నాయి. గతంలో మార్కెట్ యార్డ్ ద్వారా అమ్మకాలు రైతులకు ఉపయోగకరంగా ఉన్నప్పటికీ వారు కొనుగోలు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. గతంలో రైతులు సంఘంగా ఏర్పడి మార్క్‌ఫెడ్ ద్వారా కెపి ఉల్లి కొనుగోలు చేయాలని నిరసనలు కూడా చేపట్టారు. మనదేశంలో వినియోగించే ఉల్లిపాయలకు ఎగుమతుల అవసరాలకు పండించే కెపి ఉల్లిపాయలకు వ్యత్యాసం ఉన్నది. ప్రభుత్వం స్పందించి కెపి ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తి వేయండి శాశ్వత కెపి ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

అమ్మకం కష్టంగా మారుతోంది


ఉల్లి పంటను నూర్పిడి చేసిన తరువాత అమ్ముకుందామంటే కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు. ధరలు చాలా అధ్వాన్నంగా అడుగుతున్నారు. కెపి ఉల్లి పంటలో ఎన్నో ఏళ్లుగా సాగు చేపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కేంద్ర ప్రభుత్వం ఎగుమతులపై నిషేధం విధించిన సందర్భంలో అమ్మకం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కెపి ఉల్లి కొనుగోలు చేయాలి.

- శివ చంద్రారెడ్డి, రైతు, నాగాయపల్లె.

శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

కెపి ఉల్లి మన ప్రాంతంలో మాత్రమే సాగయ్యే ప్రత్యేక రకానికి చెందినది. సాగుకు అధిక ఖర్చులు అవుతున్నాయి. అమ్మకం సమయంలో చాలా అవస్థలు పడాల్సిన అవసరం ఏర్పడుతున్నది. ప్రభుత్వం శాశ్వత కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే సాగుకు ఆసక్తి ఉంటుంది. ధరలు నెల రోజులలోపే అమాంతంగా తగ్గిపోయాయి.

- మల్లికార్జునరెడ్డి, చల్లబసాయపల్లె, మైదుకూరు.



ఎన్నికల నిర్వహణలో బిఎల్‌ఒల పాత్ర కీలకం

- పోలింగ్ కేంద్రాల తనిఖీలో కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్నికల నిర్వహణలో బిఎల్‌ఒల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, నందలూరు మండలం ఎర్రచెరువుపల్లె గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాలలో ఉన్న బిఎల్‌ఒలను ఎన్నికలకు సంబంధించిన వివిధ ఫారంల గురించి పలు ప్రశ్నలు అడిగారు. పోలింగ్ కేంద్రాలలో ఉండవలసిన సౌకర్యాలను పరిశీలించి, సౌకర్యాలలో ఎటు వంటి లోపాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల యొక్క మ్యాపులను పరిశీలించి ఆ మ్యాపుల ప్రకారం పోలింగ్ కేంద్రాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని మండల సర్వేయర్లను మరియు మండల తహశీల్దార్లను ఆదేశించారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే బిఎల్‌ఒల పాత్ర ఎంతో ముఖ్యమని, వారు నిర్వర్తించాల్సిన బాధ్యతలలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం రాజంపేట ఆర్‌డిఒ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయంలోని వివిధ భాగాలను పరిశీలించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో ఇవిఎం మెషిన్ల ద్వారా ఓటు వేసే విధానాన్ని ప్రజలకు తెలిపేందుకు ఏర్పాటు చేసిన ఇవిఎం ప్రదర్శన కేంద్రాన్ని పరిశీలించి స్వయంగా ఓటు వేసి రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ తనిఖీలో ఆర్‌డిఒ మోహన్‌రావు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డి, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల నిర్వహణలో లోపాలుండొద్దు : ఇవిఎంల స్ట్రాంగ్ రూముల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండకూడదని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూములను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండకూడదన్నారు. ఎన్నికల నిర్వహణలో స్ట్రాంగ్ రూముల ఏర్పాటు, వాటి నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూముల మ్యాప్‌లను బట్టి ఇవిఎం మెషిన్లను తగిన రీతిలో ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూము లలోకి నీరు ఎట్టి పరిస్థితులలో రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాలని కళాశాల ప్రిన్సిపల్‌ని కలెక్టర్ కోరగా, కళాశాల నుంచి పూర్తి సహకారం అందిస్తామని ప్రిన్సిపల్ కలెక్టర్‌కు తెలియజేశారు.

మాండవ్య నదిని పరిరక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మాండవ్య నదిని కబ్జాదారుల నుండి కాపాడి, పరిరక్షించాలని సిపియం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార, అంగబలం గల వ్యక్తులు నదీతీరంలోని భూములను చదును చేసి తమ పొలాల్లో కలిపేసు కున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ప్రభుత్వ భూములను అధికార వైసిపి నేతలతోపాటు వారి అండదండలున్నవారు పోటీపడి ఆక్రమించుకున్నారన్నారు. పట్టణంలోని మాండవ్య నదికిరువైపులా స్థలాలను చదును చేసి కబ్జాకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీపురం వద్ద, రాయచోటి-కదిరి ప్రధాన రహదారిలో నదిపై వంతెనకిరువైపులా, చెన్నముక్కపల్లె వద్ద నదిని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించుకున్నారని వాపోయారు. నిరుపేదలు జానెడు ఇంటి జాగా కోసం ప్రభుత్వ భూములను ఆక్రమించి గుడిసెలు వేసుకుంటే వాటిని కాల్చివేసి కేసులు బనాయించే అధికారులు అధికార పార్టీ నాయకుల కబ్జాలు కంటికి కనిపించక పోవడం విడ్డూరం అన్నారు. బిజీలి గుట్టపై ఆక్రమణదారులపై కేసులు నమోదు చేయకపోవడం నిదర్శనం అన్నారు. మాండవ్య నదితో పాటు రాయచోటి చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

సైన్స్ ఉద్యమనేత రిటైర్డ్ ప్రొఫెసర్ భాగ్యవతి : జెవివి



భాగ్యవతి భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లి

ప్రజా సైన్స్, అక్షరాస్యత ఉద్యమనేత, విశ్రాంత ప్రొఫెసర్ భాగ్యవతి అని జనవి జ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అన్నారు. శనివారం మదనపల్లెలో ఆమె స్వల్ప అస్వస్థతతో మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని సందర్శించి జెవివి నాయకులు, పలువురు ప్రొఫెసర్లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ మదనపల్లిలోని విశ్రాంత ప్రొఫెసర్ వెంకటరెడ్డి సతీమణి భాగ్యవతి ఒక సామాజిక కార్యకర్తగా నిండు జీవితం గడిపారని తెలిపారు. ఆమె మరణంతో ఒక లోటు ఏర్పడిందని పేర్కొన్నారు. ఆమె అనంతపురం కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో, వయోజన విద్యాధిపతిగా పనిచేసి, ఉద్యోగ విరమణ తర్వాత, మదనపల్లెకు తిరిగి వచ్చారన్నారు. తన జీవిత భాగస్వామి, జన విజ్ఞాన వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డితో పాటు మదనపల్లి చుట్టుపక్కల గ్రామాలలో అనేక సామాజిక సంస్కరణ కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. పాఠశాల విద్యార్థులలో శాస్త్రీయ భావాల ప్రచారం కోసం తమ సమయాన్ని వెచ్చించేవారన్నారు. కులమతాల తారతమ్యాలు వద్దని, సమానత్వం కోసం కృషి చేశారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో దళితులపై వివక్షను నిరసిస్తూ జరిగే ఉద్యమాలలో పాల్గొన్నారని చెప్పారు. హేతువాద, సంస్కరణ భావాల ప్రచారం కోసం జీవితాంతం భాగ్యవతి నిలబడ్డారన్నారు. తమ బిడ్డలందరికీ కులాంతర, మతాంతర వివాహాలను చేశారని తెలిపారు. 2004 సమయంలో అనంతపురం జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులుగా భాగ్యవతి పనిచేశారని గుర్తుచేశారు. వారి కుటుంబానికి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ గేయానంద్ నివాళి అర్పించారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుండి ప్రముఖులు, మదనపల్లి వచ్చి,నివాళులు అర్పించారు. వారిలో ప్రొఫెసర్ రంగయ్య (హైదరాబాద్), ప్రొఫెసర్ మాలకొండయ్య (గుంటూరు), ప్రొఫెసర్ ఓబులరెడ్డి (అనంతపురం), నాగభూషణంరాజు(మాజీ డైరెక్టర్ ఆల్ ఇండియా రేడియో) డాక్టర్ ప్రసూన (అనంతపురం), డాక్టర్ శాంత (గుంటూరు), ప్రొఫెసర్ శివరామిరెడ్డి (అనంతపురం) తదితరులు ఉన్నారు. ప్రకృతి వనం నిర్వాహకులు ఎంసివి ప్రసాద్, సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.



లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న అమర్నాథ్‌రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి : జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సిఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5.40లక్షలు విలువైన చెక్కులు సంబంధిత బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి పేద ప్రజలకు తోడుగా ఉంటున్నారని, ఆరోగ్యశ్రీ వర్తించని వారికి ముఖ్య మంత్రి సహాయనిధి అందిస్తున్నట్లు తెలిపారు. సిద్ధవటం మండలం, ఉప్పరపల్లి గ్రామా నికి చెందిన నూకాల వెంకటసుబ్బయ్యకు రూ.2లక్షలు, అన్నమయ్య జిల్లా, రాజంపేట మండలం తాళ్లపాక గ్రామానికి చెందిన సూరపరాజు సుబ్బరాజు లక్ష రూపా యలు,పెనగలూరు మండలం చక్రంపేట గ్రామానికి చెందిన కల్లూరు వెంకటసుబ్బారెడ్డి రూ.75 వేలు, మన్నూరు గ్రామానికి చెందిన పిడుగు మంజులకు రూ.50వేలు, వడ్డేపల్లి దళితవాడకు చెందిన ప్రసాద్ రూ.50వేలు, మాధవరం కొండమాచపల్లి గ్రామానికి వరలక్ష్మి రూ.40వేలు, ఆకేపాడు గ్రామపంచాయతీ కట్టకిందపల్లి గ్రామానికి చెందిన ముమ్మడి ఆంజనేయులురెడ్డి రూ.30 వేలు సహాయనిధి చెక్కులను అందించారు.

'మిట్స్'లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు ఆటోమేటివ్ సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్ అండ్ టూల్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించి నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి గౌతమ్ నాయుడు, గణేష్, గోవర్ధన్‌లు పాల్గొన్నారు. బెంగు ళూరు స్మార్ట్ బైట్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గౌతమ్ నాయుడు మాట్లాడుతూ ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రక్రియ సంక్లిష్టమైనదని అన్నారు. సరైన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సాధనాలను ఉపయోగించడం, ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కోసం ఉత్తమ పద్ధతులను అనుసరించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్ సంప్రదాయకంగా సి, సి ప్లస్ అభివృద్ధి చేయబడిందని, ఇ-భాషలు వనరుల నిర్బంధిత ఎంబెడెడ్ సిస్టమ్‌లకు చాలా అనుకూ లంగా ఉంటాయని వివరించారు. అయినప్పటికీ, ఇ-భాషలు మెమోరీ, భద్రత, డేటారేస్ పరిస్థితులకు సంబంధించిన సమస్య లకు ఎక్కువగా గురవుతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్ పాల్గొన్నారు.

సమాజసేవలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మదర్ థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకొని సమాజ సేవలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే ప్రత్యేక శిబిరంలో భాగంగా మూడవరోజు కళాశాల దత్తత గ్రామమైన ధనాసిపల్లెలో విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల ఆవరణలో మట్టి కుప్పలు తొలగించి పాఠశాల ముందు చదును పరచి రాళ్లు, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం అభివృద్ధి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్-ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

30 మంది యువత రక్తదానం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అన్నిదానాల కన్నా రక్తదానం చాలా ఎంతో ఉపయోగకరమని జిఆర్ ఇన్ఫ్రా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని గండబోయనపల్లిలో 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే డ్రైవర్లు, ప్రజలు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రబాబు, రవికుమార్, సునిత, ధనంజయ, ఉమా శంకర్ రెడ్డి, అమరావతి, ఇందిరా ప్రియదర్శిని, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల్లో ప్రథమ స్థానం : టిడిపి

ప్రజాశక్తి రాయచోటి

తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు కంపెనీలు తీసుకొస్తే జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి గంజాయిని తీసుకొచ్చారని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో పలు రాష్ట్రాలలో గంజాయి పట్టుపడితే దాని మూలాలు ఆంధ్ర ప్రదేశ్‌లోనే ఉండడం జగన్ అరాచక పాలనకు నిదర్శనమని తెలిపారు అధికార వైసిపి నాయకుల కనుసన్నల్లో రాష్ట్రంలో గంజాయి విచ్చల విడిగా స్మగ్లింగ్ జరుగుతుందని గంజాయి మత్తులో యువత పడి జీవనం నాశనం చేసుకుంటున్నారని దీనికి కారణం వైసిపి నాయకులని తెలిపారు. ఈ గంజాయి స్మగ్లింగ్‌లో పోలీసులను కూడా తమ వైపుకు తిప్పుకొని విచ్చలవిడిగా స్మగ్లింగ్ చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వాఖఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అమీర్జాన్, చిన్నమండెం తెలుగుదేశం నాయకులు మల్లు, ప్రచార కార్యదర్శి రఫీ, ప్రొఫెషనల్ వింగ్ సోషల్ మీడియా నాయకులు సయ్యద్, కార్యదర్శి ఫైరోస్ పాల్గొన్నారు.

ఓటర్లకు అందుబాటులో ఉండాలి : 'చింతల'

ప్రజాశక్తి-పీలేరు

క్షేత్రస్థాయిలో వైసిపి ఓటర్లకు కార్యకర్తలు అందుబాటులో ఉంటూ వారికి తగిన భరోసా ఇవ్వాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక విఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో మండల స్థాయి వైకాపా శ్రేణుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తూర్పున సూర్యుడు ఉదయించడం ఎంత సత్యమో 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి తిరిగి అధికారంలోకి రావడం అంతే వాస్తవమన్న ధీమా వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన ఎన్నికల ఓటర్ల జాబితాలు క్షుణ్ణంగా పరిశీలించి వైసిపి ఓటర్లను గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బూతుల వారీగా ఓటర్లను గుర్తించిన తర్వాత వారు దారి మళ్ళకుండా దృష్టి సారించాలని సూచించారు. ఈ నెల 11న అనంతపురంలో జరగనున్న జగన్ బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి కూడా అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులను తరలించి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పీలేరు మండల పరిధిలోని పంచాయితీల క్రమంలో నాయకులతో సమీక్షించారు. సమావేశంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్‌రెడ్డి, ఏపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, జెడ్పిటిసి ఏటి రత్నశేఖర్ రెడ్డి, ఎంపీపీ కంభం సతీష్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఎం వెంకటాచలపతి, సర్పంచ్ షేక్ జీనత్ షఫీ, వైకాపా యువ నాయకులు జీవి రాకేష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దండు జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, మహిళా నాయకురాలు మహిత ఆనంద్, గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ నాగరాజమ్మ, సింగిల్ విండో చైర్మన్ నారే వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి



విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న హెచ్‌ఎం సావిత్రి

నాణ్యత ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలి : హెచ్‌ఎం సావిత్రి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థి దశ నుంచి నాణ్యత ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సావిత్రి అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాఠశాలలో నాణ్యత ప్రమాణాలపై స్టాండర్డ్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రసంసాపత్రాలను అందించారు. మొదటి బహుమతి జ్యోతిరాధిత్యరాయ, ద్వితీయ బహుమతి వరుణ్ సందేష్, తృతీయ బహుమతి రాజుకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర రెడ్డి, నాగరాజ, రమణప్ప, వసుమతి, కల్పలత, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ సహాయం అందించేందుకు కృషి : జడ్జి

ప్రజాశక్తి-రాయచోటి/లక్కిరెడ్డిపల్లె

యువతను పునరుద్ధరించడం, జైల్లో ఉన్న బాల నేరస్తులను గుర్తించడం, వారికి న్యాయ సహాయం అందించడం కోసం పాన్ ఇండియా ప్రచారం-2024 ముఖ్య ఉద్దేశమని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శనివారం డిఎల్‌ఎస్‌ఎ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి రాయచోటి సబ్ జైలును సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, కమలాపురం జైళ్లలో పాన్ ఇండియా-2024 ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ శారద, రాయచోటి సబ్ జైల్ సూపరింటెండెంట్ పర్నెంట్, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చర్యలు

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లె కోర్టును జడ్జి సందర్శించారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి కృషి చేయాలని న్యాయవాదులకు సూచించారు.కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఫైజునిస, బార్ ప్రెసిడెంట్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిరుత్సాహం

ప్రజా'దృష్టి'

కేంద్ర బడ్జెట్ నిరుత్సాహపరిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 47.66 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో ఎటువంటి శషబిషలకు తావు లేకుండానే దేశంలోని కార్పొరేట్లకు మేలు చేస్తూ బడ్జెట్‌ను వండివార్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల వేళ పేదలు, మధ్య తరగతి, రైతుల గురించి ఆలోచిస్తుందని ఆశించిన వారికి తీవ్ర నిరాశను కలిగించింది. సుమారు రెండు కోట్ల ప్రభుత్వ, మరో రెండు కోట్ల ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను నిర్లక్ష్యం చేసింది. వేతన జీవుల వేతన శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయకుండా నిరుత్సాహపరిచింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మహిళలకు మేలు చేస్తున్నట్లు బడ్జెట్లో ప్రకటించింది. దేశంలోని 83 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని తొమ్మిది కోట్ల మంది సభ్యులకు, ఆయుష్మాన్ భారత్‌లో ఆశాలు, అంగన్వాడీలకు స్థానం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన ప్రధాని మోడీ, 2024 నడుస్తున్నప్పటికీ రైతుల ఆదా యాన్ని రెట్టింపు చేస్తామన్న హామీ నీరోడుతోంది. ఇది చాలదన్నట్లు రైతుల ఆదాయాన్ని అధికం చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా మారిందనే వాదన వినిపిస్తోంది. రాష్ట్ర విభజన హామీలైన కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న హామీని నిర్లక్ష్యం చేసింది. ప్రతి ఏటా రాష్ట్రంలోని రాజకీయ విశ్లేషకులు, మేధావులు అడిగినప్పుడు పదేళ్లలో అమలు చేయాల్సిన నిర్ణయాలని, ఇంకా సమయం ఉందని దాటవేయడం తెలిసిందే. రాష్ట్రం విడిపోయి నేటితో పదేళ్లు నిండిన నేపథ్యంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులను విడుదలను నిలిపేసింది. కడప-బెంగళూరు రైల్వేలైన్ ఏర్పాటు కలగా మారింది. 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ కేంద్ర, రాష్ట్రాల సంయుక్త భాగస్వామ్యంతో రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతంలో రాష్ట్రంలోని వైఎస్ జగన్ సర్కారు ఆయన ఆశయాన్ని అడియాశలు చేసేదిశగా పయనిస్తోంది. కడప నుంచి బెంగళూరుకు రైల్వేలైన్ ఏర్పడితే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల దగ్గర నుంచి రైతుల ఉత్పత్తులు, ఇతర పారిశ్రామిక ఉత్పత్తుల సరఫరా చేయడం సులభంగా మారనుంది. ఫలితంగా వెనుకబడిన ప్రాంతంలోని కడప జిల్లా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇక్కడ నుంచి సరుకుల రవాణా దగ్గర నుంచి మానవ వనరుల రాకపోకలు పెరగడం ద్వారా పేదలకు మేలు కలిగే అవకాశం ఉండేది. ఇటువంటి ప్రజల సౌకర్యాలను కాదని, ముద్దనూరు మీదుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ముదిగుబ్బ మీదుగా రైల్వేలైన్ ఏర్పాటుకు మొగ్గు చూపించడం విస్మయాన్ని కలిగించింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం ఆందోళనకరం. ఇది చాలద న్నట్లు కేంద్రం మొండి చేయి చూపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేప థ్యంలో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన కడప, రాజంపేట ఎంపీలు సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం గమనార్హం. దీంతోపాటు ఓబులారిపల్లి-కృష్ణపట్నం రైల్వేలైన్‌ను సరుకుల రవాణాకు పరిమితం చేయడంపై ఎటువంటి స్పందన లేకపోవడం, జిల్లా నుంచి ప్రొద్దు టూరు-కంభం సహా పలు రైల్వేలైన్లకు కేటాయింపులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఏదేమైనా జిల్లా ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవహరించలేని ఎంపీల వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి


నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

తహశీల్దార్ హత్య దారుణం

-నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విశాఖపట్నంలో తహశీల్దార్ రమణయ్య హత్య అత్యంత దారుణమని ఇన్‌ఛార్జి తహశీల్దార్ అమరేశ్వరి అన్నారు. శనివారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అమరేశ్వరి మాట్లాడుతూ ఒక మండల మెజిస్ట్రేట్‌గా ఉన్న తహశీల్దార్ మండలంలో ప్రజల కొరకు అహర్నిశలు పాటు పడుతూ అందుబాటులో ఉంటారని అలాంటి అధికారిని అత్యంత దారుణంగా హత్య చేయడం అమానుషమ ఆవేదన వ్యక్తం చేశారు. హత్య చేసిన వారిని గుర్తించి కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మానస, రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటసాయి. రాఘవేంద్ర, జూనియర్ అసిస్టెంట్ రుత్విక్, హర్ష, ఎఎస్ఒ షణ్ముగం, విఆర్ఒలు భారతి, చాన్ బాషా, నిరంజన్ పాల్గొన్నారు.

మన్నూరు సిఐగా రవీంద్రనాథ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



అసాంఘిక శక్తులపై ఉక్కు పాదం మోపుతామని మన్నూరు అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన ఎన్.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. మన్నూరు ఎస్ఐ భక్తవత్సలం రాయచోటికి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఈయన శ్రీ సత్యసాయి జిల్లా నుంచి అప్ గ్రేడ్ సిఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మట్కా, జూదం, బెల్టు షాపులు వంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని తెలిపారు.

కలికిరి సిఐగా ఆర్.మోహన్



కలికిరి : కలికిరి పోలీస్ స్టేషన్ సిఐగా ఆర్. మోహన్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన రహీముల్లా కెవి.పల్లికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురంలో పనిచేస్తున్న మోహన్‌ను బదిలీపై బాధ్యతు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని అన్నారు.మండ లంలో ఎక్కడైనా సారా అమ్మకాలు, కోడిపందెలు, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాంటి వారిపై కఠిన మైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాల్మీకిపురం సిఐగా పులిశేఖర్



వాల్మీకిపురం :వాల్మీకిపురం సిఐగా పులి శేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ సురేష్ కుమార్ కర్నూలు విఆర్‌కు బదిలీ కావడంతో నంద్యాల విఆర్‌లో ఉన్న పులిశేఖర్ బదిలీపై వాల్మీకిపురంకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని రాత్రి గస్తీని ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు, ఇన్సూరెన్స్, వాహన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ఎవ్వరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైన ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సర్కిల్ పరిధిలో నాటుసారా, గుట్కా, జూదం, అక్రమ మద్యంపై గట్టి నిఘా వుంచి, అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపిడిఒగా ప్రభాకర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-రామాపురం

రామాపురం మండల అభివృద్ధి అధికారిగా డి.ప్రభాకర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా పామిడి మండలంలో ఎంపిడిఒగా పని చేస్తూ బదిలీ అయినట్లు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న హైదర్ వల్లి చక్రాయిపేట మండలానికి బదిలీపై వెళ్లారు.

గాలివీడు ఎంపిడిఒ బదిలీ

గాలివీడు : స్థానిక ఎంపిడిఒ శేఖర్‌నాయక్ నందలూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా వేపరాల ఎంపిడిఒగా పిడి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం.


ద్వితీయ స్థానం సాధించిన కబడ్డీ జట్టుతో ఉపాధ్యాయులు

జిల్లా స్థాయి బాలికల కబడ్డీలో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

జిల్లాస్థాయి బాలికల కబడ్డీ పోటీలలో ఎస్‌వి జూనియర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎన్ శ్రీనివాసులు, డైరెక్టర్ ఎస్.వసుంధర తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత శుక్రవారం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలలో భాగంగా జిల్లా స్థాయి బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో రెండవ స్థానం సాధించారని తెలిపారు. ప్రిన్సిపల్, డైరెక్టర్‌తో పాటు పిఇటిలు పుల్లారావు, విద్యార్థులను అభినందించారు.

తహశీల్దార్‌కు సన్మానం

గాలివీడు : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీలలో భాగంగా గాలివీడు తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న దైవాదీనం చిత్తూరు జిల్లా పాలెంకు బదిలీపై వెళ్తున్నారు. బదిలీపై వెళ్తున్న తహశీల్దార్‌ను శనివారం రెవెన్యూ సిబ్బంది దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో డిటి తిమ్మారెడ్డి, అర్ఐ బాలాజీ , విఆర్ఒలు శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, శివయ్య, విఆర్ఎలు విజయ్ కుమార్ , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఆదివారం అమీన్ మెడికల్ స్టోర్‌లో శ్రీ సాయి నర్సింగ్‌హోమ్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు అమీర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కంటి పరిక్ష నిర్వహించబడతాయని అన్నారు. వైద్య శిబిరానికి వచ్చే ఆరోగ్యశ్రీ కార్డు ఆధార్ కార్డు ఒరిజినల్ తప్పక తీసుకుని రావాలని వారు పేర్కొన్నారు.

బిసిల నడ్డి విరుస్తున్న సిఎం జగన్ : 'కస్తూరి'

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో శనివారం టిడిపి ఆదేశాల మేరకు రైల్వే కోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాద నాయుడు ఆధ్వర్యంలో జయహో బిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎం జగన్ బిసిల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ఆదరణ లాంటి కార్పొరేషన్ రుణాలు, విదేశీ విద్య, పెళ్లి కానుకలు, బిసి భవన నిర్మా ణాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు, రజకులకు వాషింగ్ మిషన్ల పంపిణీ, మహిళలకు పారిశ్రామిక రాయితీలు ఇలా ఎన్నో 30కి పైగా బిసి సంక్షేమ పథకాలు రద్దు చేసిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని తెలిపారు. 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు కబ్జా చేయడం వైసిపి నాయకులకే సొంతమని తెలిపారు. 74 మంది బిసిలను హత్య చేయడం జరిగిందని. రాష్ట్రవ్యాప్తంగా వేలమంది బిసిలపై తప్పుడు కేసులు బనాయించి వారిపై దాడులు చేసి వేదిస్తున్నారని అన్నారు. బిసిలకు అత్యంత ప్రాధాన్యత ఇసు న్నామని గొప్పలు చెప్పుకుంటూ ప్రగల్బాలు పలుకుతూ బిసి మంత్రి చెలు బోయిన వేణును వైవి.సుబ్బారెడ్డి ముందు మోకాలి దండం వేయించారని అన్నారు. దీనిని బట్టి చూస్తే పేరుకే బిసిలకు మంత్రి పదవులు పెత్తనం మనకు స్పష్టంగా కళ్ళముందే కనబడుతుందని తెలిపారు. జనాభా కుల గణ


సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు

నలో చేపట్టాలని డిమాండ్ దేశవ్యాప్తంగా ఉందన్నారు.టిడిపి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో బిసి రిజర్వేషన్లపై శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్ సుధాకర్‌నాయుడు, ఉపాధ్యక్షులు కాపిర్ల చంద్రశేఖర్ నాయుడు, జనసేన నాయకుడు పసుపులేటి వెంకటరమణ, వెంకట సుబ్బయ్య, నరసాపురం సుబ్బన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ


రైతులకు సూచనలు ఇస్తున్న నాగమణి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని నూలివీడు, సిసిపల్లి గ్రామాలలో మామిడి పూత, పిందే సమయంలో చేపట్ట వలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉద్యాన శాఖ అధికారి నాగమణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూత త్వరగా ఒకే సారి రావడానికి, ఆడ పూల శాతం పెరగడానికి 13-0-4510 గ్రా. లీటర్ నీటికి మాంగో స్పెషల్ 5 గ్రా. లీటర్ నీటికి లేదా ఫార్ములా-4ఏ 5 గ్రా.లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. మామిడిలో పూమొగ్గ దశ లో తేన మంచు పురుగు, మసి తెగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉందని వీటి నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మి లీ. ఒక లీటర్ నీటికి మ్యాంకోజెబ్ 2 గ్రా. లీటర్ నీటికి పిచికారి చేయాలని తెలి పారు. పచ్చి పూత దశలో ఆశించే తేన మంచు పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు నివారణకు బుప్రోఫెజిన్ 1.5మి లీ. లీటర్ నీటికి కంటాఫ్ 2మి.లీ లీటర్ నీటికి అజాడిరెక్టిన్ 2 మి.లీ లీటర్ నీటికి పిచికారి చేయాలని రైతులకు తెలిపారు. తెల్ల పూత దశలో ఎలాంటి రసాయన మందులు పిచికారీ చేయకూడదని తెలిపారు. మామిడి నల్ల పూత దశ అనగా పిందె బఠాణీ గింజ సైజులో ఉన్నప్పుడు ఆశించే తేనె మంచుపురుగు, తామర పురుగు, బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు, మరియు పిందె రాలడం నివా రణకు బుప్రోఫెజిన్ ం ఎసిఫెట్ 1 గ్రా. లీటర్ నీటికి , సాఫ్ 2 గ్రా. లీటర్ నీటికి మరియు ప్లానోఫిక్స్ 0.25 మి లీ లీటర్ నీటికి పిచికారి చేయాలని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు ఉమాపతిరెడ్డి, కృష్ణారెడ్డి, ఆర్‌బికె సహాయకులు రాణాప్రతాప్, మారుతి, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అందించే సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రజలకు అందించే సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఎంపిడిఒ సరేంద్రనాయక్ పేర్కొన్నారు. బదిలీపై వెళుతున్న ఎంపిడిఒకు శనివారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ బదిలీపై రాయచోటికి వెళ్తున్న సందర్భంగా ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు దుశ్శాలువా, పూలమాలలతో ఆయనను సత్కరించారు. ఎంపిడిఒ సురేంద్రనాథ్ విధి నిర్వహణలో ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి విమర్శలు లేకుండా విధులు నిర్వహించడం హర్షణీయమని కొని యాడారు. అందరి సమిష్టి సహకారంతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో విజయవంతం చేసి మండలానికి ఒక ప్రత్యేక గుర్తింపు తేవడం అభినందనీయమని అన్నారు. ఆయన మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యాలయం ఆనంద్‌కుమార్, ఆర్‌బికె చైర్మన్


ఎంపిడిఒను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

మల్‌రెడ్డి, శివారెడ్డి,కోటిరెడ్డి, శ్రీనివాసులు, మైనుద్దీన్, రామ్మూర్తి పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన టిడిపి నాయకులు

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం : టిడిపి

ప్రజాశక్తి-కలకడ

రాష్ట్రంలో అరాచక పాలనను సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని టిడిపి నాయకులు జిలానీ, టిఎన్ కరీముల్లాలు పేర్కొన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చేపట్టే కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజలను చైతన్య వంతులను చేసి ఓటు అనే ఆయుధంతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తగిన బుద్ధి చెప్పాలన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఓటమి చెందారని ఇప్పుడు మరల పునరావృతం కాకుండా ఆయన విజయానికి తీవ్రంగా కృషి చేద్దామని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. టిడిపి గెలుపే ధ్యేయంగా పనిచేసి కిషోర్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా గెలిపికుందామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యక్రమంలో నాయకలు శ్రీనివాస్‌రెడ్డి, ఖాజా, ఇర్ఫాన్, ఇమ్రాన్, బూత్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నర్సింహులు

అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఉపాధ్యాయ అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మంద నర్సింహులు పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావే శానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లా డుతూ ఇటీవల జరిగిన రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ సమావేశంలో అప్రెంటీస్ విధా నాన్ని తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరే కిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో లక్కి రెడ్డి పల్లి మండల ప్రధాన కార్య దర్శి మనోహర్, శ్రీనివాసులు, మల్లయ్య మండల ఉపాధ్యక్షులు సాయి చరణ్ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మెకు మద్దతు

- ఎపిఎండిసి పోరాట కమిటీ జెఎసి

ప్రజాశక్తి -ఓబులవారిపల్లి

మండలంలో మంగంపేట ఎపిఎండిసి సంస్థలో ఎపిఎండిసి అవుట్‌సోర్సింగ్ ట్రైనింగ్ పోరాట కమిటీ, జెఎసి ఆధ్వర్యంలో సమ్మె నోటీసును సిపిఒ ద్వారా ఎండికి పంపినట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్. జెఎసి పోరాట కన్వీనర్, రేగులకుంట వెంకటేష్, ఎపిఎండిసి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, బండారు భాస్కర్‌లు పేర్కొన్నారు. శనివారం మూడు యూనియన్ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎంపిఎండిసిలో బ్యాలెన్స్ 20శాతం కార్మికులకు, సమాన పనికి సమాన వేతనంలో జరిగిన, అన్యాయాన్ని, లోపాలను సరిచేయాలని అన్నారు. అవుట్‌సోర్సింగ్, ట్రైనీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కార్మికులకు జీతాలు నేరుగా యాజమాన్యమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేయడానికి ఉపసంహరించుకోవాలని అన్నారు. పోరాడి సాధించుకున్న, 8 గంటల పనిని 12 గంటలు చేయడాన్ని మానుకోవాలన్నారు. ఔట్సోర్స్ ట్రైనింగ్ , కాంట్రాక్ట్ ,కార్మికులను, ప్రభుత్వ రంగా సంస్థల వాటాల అమ్మకం, ప్రయివేటీకరణ ఆపాలని అన్నారు. రైతు లకు గిట్టబడతారు కల్పించాలని, నిత్యవసర ధరలు తగ్గించాలని, ఆహార వస్తువులపై, జిఎస్‌టి ఎత్తివేయాలనే డిమాండ్లతో దేశవ్యాప్తంగా సార్వత్రిక గ్రామీణ బంద్ జరుగుతుందని తెలిపారు.బంద్‌లో అందరూ పాల్గొని జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిఎండిసి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నారదాసు సుబ్బరాయుడు, జెఎసి నాయకులు కుప్పాల సుబ్రహ్మణ్యం, అరుణావతి, అంకయ్య బాబు,శేఖర్, రాధ, హరి,ఉదయ్, ఆంజనేయులు,కార్మికులు పాల్గొన్నారు.



మైక్‌సెట్‌ను అందిస్తున్న సంస్థ సభ్యులు

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక మన్నూరులోని జడ్‌పి హైస్కూల్‌కు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు షేక్ అబ్దుల్లా, విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడుల ఆర్థిక సహకారంతో మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విలువలతో కూడిన విద్యను బోధించాలని తెలిపారు. చిన్న తనంలోనే తరగతి గదిలోని నాలుగు గోడల మధ్య విద్యార్థి భవిష్యత్తు నిర్ణయించబడి ఉంటుందని, ఉపాధ్యాయులు వారి భవిష్యత్తుకు పూల బాటలు వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పరిమళ, మానవత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి గ్రస్తులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆదేశానుసారం కుష్టు వ్యాధిగ్రస్తులకు భోజనంతో పాటు మహిళలు, పురుషులకు దుస్తులు పంపిణీ చేశారు.ప్రతి ఒక్కరూ సేవా గుణంతో అబాగ్యులను ఆదుకునేందుకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బానరసయ్య నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షులు ఆర్.సతీష్‌రాజు, సీనియర్ నాయకులు కోటయ్య నాయుడు, జి.వి.సుబ్బరాజు, పరుశురాం నాయుడు, సూర్యనారాయణరాజు, నాగేంద్ర తులసి, కొమ్మివారి పల్లె శంకర్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

రికార్డులను అప్‌డేట్ చేసుకోండి

ప్రజాశక్తి-గాలివీడు

ఉపాధి సిబ్బంది ఎఫ్ఎటిఎలు ఏరోజుకారోజు రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం ఎంపిడిఒ సభా భవనంలో ఉపాధిహామీ పథకం పైన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. కూలీల సంఖ్యను పెంచాలని పనులపై పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడి రెడ్డయ్య, ఇసి ఆంజనేయులు, ఎపిఒలు రామచంద్ర, హరి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న సుధాకర్

సుధాకర్‌కు డాక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ అవార్డు

ప్రజాశక్తి-సుండుపల్లి

సుండుపల్లి మండలంలోని మాధురి పాఠశాల కరస్పాండెంట్ రేపన సుధాకర్‌కు డాక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ అవార్డు లభించింది. శనివారం పాండిచ్చేరిలో హోటల్ సెన్‌బాగ్‌లో జరిగిన దక్షిణ భారత దేశంలో క్రిస్టియన్ యూనివర్సిటీ ఫర్ ఫారెన్ స్టడీస్ ద్వారా అవార్డును అందించారు. సామాజిక రంగ అభివృద్ధికి గొప్ప సామాజిక సహకారం, నాయకత్వ లక్షణాలు ఆధారంగా విద్యారంగంలో అద్భుతమైన సేవలు చేయడం వల్ల ఈ అవార్డు ఇచ్చారని సుధాకర్ తెలిపారు. కరస్పాండెంట్‌కు అవార్డు రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.


సర్పంచ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి

వైసిపి సర్పంచ్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పుత్తనవారిపల్లి గ్రామానికి చెందిన వైసిపి సర్పంచ్ జంగం సుబ్రహ్మణ్యం శనివారం రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ టిడిపి ప్రకటిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు మంచి చేకూరిస్తాయని ఉద్దేశంతో ఆ పార్టీలో చేరానని తెలిపారు.కార్యక్రమంలో కులంపేట టిడిపి అధ్యక్షుడు ఆర్.సుధాకర్‌నాయుడు, ఉపాధ్యక్షులు కాపర్ల చంద్రశేఖర్‌నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్వీపింగ్ మిషన్‌ను అందిస్తున్న సర్పంచ్ తోట శివసాయి

పంచాయతీకి సొంత నిధులతో స్వీపింగ్ మిషన్

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వేకోడూరు మేజర్ గ్రామపంచాయతీకి ఉప సర్పంచ్ తోట శివసాయి 2.60 లక్షల రూపాయల సొంత నిధులతో రోడ్లపై చెత్తను తొలగించే స్వీపింగ్ మిషను శనివారం అందజేశారు. సర్పంచ్ శివయ్య, పంచాయతీ ఇఒ ప్రసాద్‌రావు స్వీపింగ్ మిషన్ పనితీరును పరిశీలించారు. శివ సాయి తన సొంత ఖర్చులతో ఇదివరకే పంచాయతీకి చెత్త సేకరించే ఆటోలను కూడా అందించారు. కోడూరు గ్రామపంచాయతీ అన్ని రంగాలలో ముందుండాలనే ఉద్దేశంతోనే తన వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి ఆదర్శంగా పంచాయతీగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.

దుబాయిలో కలిచెర్ల వాసి మృతి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని కలిచెర్ల నివాసమున్న షేక్ అసన్‌వలి కుమారుడు షబ్బీర్‌వల్లి బ్రతుకుదెరువు కోసం ఉన్న ఊరును, దేశాన్ని వదిలి దుబాయ్‌కు వెళ్లి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలమేరకు.. షబ్బీర్‌వల్లి కుటుంబ పోషణ కోసం మూడు నెలల క్రితం దుబాయ్‌కు వెళ్లాడని చెప్పారు. శుక్రవారం మసీద్‌కు పోయి రూముకు వచ్చి అనతరం ఉన్నట్లు ఉండి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతి నికి భార్య, ఐదుగురు ఆడపిల్లల, ఒక్క కుమారుడు ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి యువకుడి మృతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం


సోమశేఖర్ (ఫైల్ ఫొటో)

ఓ యువకుడు రైలు కింద పడి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని చింత పర్తి సమీపంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు..మదనపల్లి మండలం, కొండామర్రిపల్లి, టిఎన్ఆర్ కాలనీకి చెందిన పెద్దరెడ్డి కుమారుడు అనిపినేని సోమశేఖర్(26) వాల్మీకి పురం మండలం చింతపర్తి సమీపంలో వాల్మీకి పురం-కలికిరి రైల్వే లైన్‌పై పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.